# అదే మనం చేస్తున్న తప్పు...

"అబ్బాయికి ఈల వేయటం కూడా వచ్చే?"

"మరేమనుకున్నావోయ్ ఈలపాట రఘురామయ్యా నేనూ క్లాస్‌మేట్స్‌ం తెలుసా?"

"ఓహో... ఇప్పుడు నీ వయసెంతోయ్ రాంబాబూ?"

"నీకు తెలీదా వీణా? నా వయసు నా భార్యవైన నీకు తెలియదా?"

"నీ నోటితో వినాలని ఉంది చెప్పరాదూ?"

"ఎంత? ముప్పై అయిదు..."

"ఓస్‌అంతేకదా!"

"అంతే."

"మరి ఈలపాట రఘురామయ్య నీ క్లాస్‌మేట్ ఎలా అయ్యాడు?"

"అమ్మ ... అమ్మ.!! నొప్పి. భర్తచెవి మెలేయకూడదు వీణా తప్పు వదిలేయ్?"...

"భర్త మాత్రం భార్యతో అబద్దాలు చెప్పొచ్చునేం?"

"హమ్మయ్య - వదిలేశావా - అసలేం జరిగిందంటే..."

"ఏం జరిగిందంటే?..."

"జరిగిందంటే కాదు - జరుగుతూందంటే..."

"సరే జరుగుతూందంటే..."

"అమితోత్సాహంగా, ఆనందంగా ఉన్నప్పుడు అలా అబద్ధాలు వచ్చేస్తాయి అంతే.."

"అమితోత్సాహం, ఆనందం నీకు పనికిరావన్న మాట."

"అసలు నా ఉద్దేశం ఏంటంటే... ఇది అబద్ధం కాదు. కాస్త ఎగ్జాగరేషన్ అంతే".

"అయతే ఇవ్వాళ తమరి అమితోత్సాహానికి, ఆనందానికి కారణమేమిటో?"

"అలా అడిగావు బాగుంది - అతి త్వరలో మనమో పెద్దిల్లు అద్దెకు తీసుకోవాలోయ్."

"ఎందుకు?"

"ముందు ముందు నా సలహాల కోసం జనం తండోపతండాలుగా వచ్చే అవకాశం ఉంది. ఇప్పుడే మన వీధి చివరి కాలేజి కుర్రాడు అడిగితే ఒక మంచి సలహా ఇచ్చి వస్తున్నాను తెలుసా? కావాలంటే నువ్వు కూడా అడుగు ఇస్తాను."

"ఓహూ అలాగా? ఇరాక్ - ఇరాన్ యుద్ధం ఎలా అంతమవుతుంది స్వామీ!"

"ఇరాక్... ఇరాన్ యుద్ధమా! ఆ విషయం మన కెందుకు వీణా? మన దేశానికి సంబంధించని విషయం మనకెందుకు వీణా? మన దేశానికి సంబంధించిన విషయాలు అడుగు."

"అలాగే అలాగే శ్రీలంక - భారతదేశాల మధ్య సయోధ్యకు సలహా ఇవ్వగలవా సఖా?"

"........."

"చెప్పవేం?"

"ఏదైనా ఇండియాకు సంబంధించిన విషయాల మీద సలహా అడగవోయ్."

"ఇది ఇండియాకు సంబంధించిన విషయం కాదా? అక్కడ ఊచకోతకు గురవుతున్న తమిళులు మనవాళ్ళు కాదా?"

"అవుననుకో కాని పరాయిదేశం ఆంతరంగిక విషయంలో జోక్యం చేసుకున్నట్టు అవుతుందేమో?"

"సరే మహానుభావా, పంజాబు సమస్య పరిష్కారానికి మీ సలహా ఏమిటి?"

"అదీ..."

"ఊ... అదీ..."

"అదీ..."

"తల గోక్కోకు, పోనీ బోఫోర్స్ దొంగల్ని పట్టుకునే మార్గ మేమిటో చెప్తావా?"

"అమ్మో, గవర్నమెంటు ఉద్యోగినన్న మాట మరిచావా వీణా? అసలే ఇవి ఎమర్జెన్సీని తలపుకు తెస్తున్న రోజులు."

"అయితే ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమేసంబంధం ఉన్న విషయాలు అడగనా?"

"ఓ యస్."

"తెలుగు గంగకు విముక్తి ఎప్పుడు స్వామీ?"

"శంకరానందులకు దయ కలిగినప్పుడు."

"ఆయన. ఇప్పుడు నీటి వ్యవహారాలు కాదు బోఫార్స్ 'కోటి' వ్యవహారాలు చూస్తున్నారు.

"అయితే...."

"ఊ....అయితే ఇంకో విషయం అడగమంటావా? టీ.వీ.ప్రసారాల్లో హిందీకి కేటాయించిన సమయమెంత? తెలుగు కార్యక్రమాలకు వదిలేసిన సమయమెంత? చివరికి పిల్లల కార్యక్రమాలు కూడా హిందీవే వినితీరాలా?"

"అవన్నీ కేంద్రాన్ని ప్రశ్నించినట్టు అవుతుంది. మనకెందుకు లెద్దూ."

"అయితే అచ్చంగా హైదరాబాదుకు సంబంధించిన విషయాలే అడగనా డియర్?"

"కరెక్ట్... మనం ఉండే హైదరాబాద్‌ను గురించి ఆలోచించుకుంటే పోలా?"

"నీటి ఎద్దడి నుంచి జంట నగరాల జనాన్ని కాపాడటానికి సలహా ఏమిటి?"

"......"

"ఊఁ చెప్పవేం?"

"... అదీ...."

"ఉప్పు నీళ్ళలో పప్పు ఉడకడం కష్టంగా ఉంది. కదా... నీటి నుంచి ఉప్పు నెలా తొలగించాలి?"

"........"

"మూత్రశాలల ముందు, సారా, కల్లు దుకాణాల ముందు ఈ మధ్య బస్‌స్టాపుల్ని ఏర్పాటు చేశారు కదా - అలా చేయమని ఆర్టీసీ వాళ్ళకు సలహా ఇచ్చింది తమరేనా స్వామీ?"

"ఛా ఛా నేను కాదు."

"అయితే వీధి చివరి కాలేజీ కుర్రాడికి నువ్వు ఇచ్చిన సలహా ఏమిటి ప్రాణనాథ? న్యూస్ పేపర్లు చూడకు నాయనా చెడిపోతావనేనా?"

"ఊహూఁ..."

"స్విస్ బ్యాంక్ ఊసెత్తకు నాయనా ఉద్యోగం దొరకదనా?"

"ఊహూఁ..."

"మరేవిటోయ్?..."

"లోకల్ ఎలక్షన్లు వచ్చాయి కదా – పోటీ చేయనా మాస్టారు అని అడిగాడు."

"ఊహూఁ..."

"వద్దు నాయనా – నీలాంటి మంచి కుర్రాడు రాజకీయాల్లోకి దిగరాదు అన్నాను."

"ఇదేనా నువ్విచ్చిన బ్రహ్మాండమైన మంచిసలహా?"

"ఆ!..."

"ముందా కాలరు మీద చేయి తీసెయ్."

"ఎందుకు?"

"మురికైపోతుంది."

"ఓహో ఉతికేది నువ్వేకదూ..."

"ఉతుకుతా ఉతుకుతా. ఎప్పుడో నీ మెదడు కూడా ఉతికి శుభ్రంగా ఇస్త్రీ చేస్తా చూడు."

"అదేవిటి వీణా అంతకోపమెందుకొచ్చింది?"

"ఏదీ ఆ కుర్రాడికిచ్చిన సలహా మరోసారి చెప్పు."

"ఏ కుర్రాడికి?"

"అదే వీధి చివరి కాలేజీ కుర్రాడికిచ్చిన సలహా."

"అవునవును. ఆ సలహా మరోసారి చెప్పలేదు కదూ... మంచి సలహాలు ఒకటికి రెండుసార్లు వినాలోయ్ చెబుతా విను. నీలాంటి మంచి కుర్రాడు రాజకీయాల్లోకి దిగకూడదు. లోకల్ ఎలక్షన్లలో పోటీ చేయకు అని."

"ఆ సలహా ఇచ్చేనా ఇంత పొంగిపోతున్నావ్?"

"అవునూ..."

"సిగ్గు లేకపోతే సరి – "

"ఆc??..."

"మంచి వాళ్ళను దూరంగా ఉంచుతున్నాం కనుకనే మన రాజకీయాలు ఇలా తగలడ్డాయి...."

"ఆc? "

"ఆc!"

*ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 2-3-1988*